


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**ఆ రెండు మూడు** సందర్భాల తరువాత అనంతానికి వామన మీది దురాభిప్రాయం పోయి, అపార్థం చేసుకున్నందుకు పాశ్చాత్తాపం కూడా కలిగి బాధించింది. నేను చెప్పినట్టు రాయి, సొంత తెలివి తేటలు చూపించక అంటే తాను చేయగలిగింది ఏమీ లేదు. మనుషులను అపార్థం చేసుకోడం ఎంత సులువో అర్థం చేసుకోడం అంత కష్టం.

"భగవాన్! నాకు తగిన లోకజ్ఞానాన్ని ప్రసాదించవూ?"

ఇపుడు వామన అనంతం పని భారాన్ని తగ్గించి ఆ పనిని మరొకడికి ఇచ్చాడు.

ఒకరోజు అనంతం ఇంటికి పోవడం ఆలస్యం అయింది. మామూలుగా అయితే ఆఖరు క్షణం దాకా ఫ్యాక్టరీలో ఉండే శరభ అరగంట ముందే వెళ్ళిపోయాడు, హరికథకు వెళ్లాలని. పిట్ట కథలు అధికంగాను పురాణం తక్కువ గాను ఆ భాగవతారిణి చెప్పి "కాలక్షేపం" బాగా చేస్తుంది. ఆమె గానం, నాట్యం కూడా అభ్యసించి ఉండటం చేతా ఇహ పరాలకు ఆమె హరికథ ఉపయోగ పడుతుంది. కొసరులా మంచి మంచి ప్రసాదాలూ ఉంటాయి. పచ్చి మిర్చీ సన్నగా తరిగి కలిపిన ఒడపప్పుకు నిమ్మకాయ జోడీ అయి నాలుక సుఖాన్ని కలుగ చేస్తుంది. మిగతా ప్రసాదాల కన్నా ఈ ప్రసాదం శరభకు ఎక్కువ ఇష్టం; భార్య అంత బాగా చేయలేదు. దైవ కృప తోడైన ప్రసాదం రుచే వేరు.

వామన ఎక్కువ ఆలస్యంగా ఉండడు సాధారాణంగా; అతి ముఖ్యమైన పనులు ఉన్నపుడు ఉండి పోయి ఆ పనులను పర్యవేక్షిస్తాడు. వామన వాహనం వర్కుషెడ్డు ద్వారం దగ్గిరగా పెట్టి ఉంది ఎదో ప్యాకేజీలు డిక్కీలో పెట్టుకోడానికి వీలుగా. ఒక్క కాపలా దారుడు మిగిలాడు. అనంతం మిగతా వాళ్లతో కలిసి వెళ్ళిపోయి ఉంటాడని వామన అనుకున్నాడేమో తెలియదు. రోడ్డు మీది వాళ్ళ ప్రాణాలే కాక, సొంత ప్రాణాన్ని కూడా నైవేద్యంగా వామన ప్రాణం గురించి సమర్పించడానికి సదా సిద్ధంగా ఉండే వ్యక్తిగత డ్రైవరు దొంగలా కళ్ళు తిప్పుతూ కనబడకుండా కారు అవతలివైపు నిలబడి

ఉన్నాడు. షెడ్డు బైట వెలుతురూ సరిగ్గా లేక దొంగతనానికి అనుకూలంగా ఉంది. అనుకోకుండా, దొంగలా అనంతం లఘుశంకకు వెళుతున్నపుడు అక్కడ నిగూఢంగా ఏమైనా జరుగుతోందా? అని అనుకుని తాను మరీ ప్రతిదాన్ని ఈ మధ్య బూతద్దంలో చూస్తున్నాడని పించి విచారించాడు. పంట్లాము గుండీలు పెట్టుకుంటూ తన నీడను చూసుకుంటూ వస్తుండగా ఆ ముగ్గురు వ్యక్తులూ అనుమానాస్పదంగానే కనిపించారు. దొంగతనాన్ని పసికట్టటం అసాధ్యమైన విషయం కాదు. ఇద్దరు మనుషులు డిక్కీ లోకి పెద్ద పాకేజీలు ఎక్కించడం, వెనుక సీటు మీద మరో ప్యాకేజీ పెట్టడం, వాహనం వేగంగా వెళ్లిపోవడం కనురెప్ప పాటులో జరిగిపోయింది. అది ఎంత విలువైన సరుకో అనంతానికి అంతుపట్టలేదు.

మనసులో అనంతానికి అలజడి మొదలయింది. తనకు పట్టెడు తిండి పెట్టే సంస్థ రొమ్ము గుద్దడం తాను చూశాడు. ఏమీ చేయలేని అసహాయత క్రుంగ దీసింది. అది నిజానికి అసమర్థత కాక ఆ అన్యాయంలో పరోక్షంగా తానూ పాలు పంచుకున్నట్టు అనిపించింది. ఏదీ రూఢీగా తెలియకుండా కేవలం ఒక బలమైన అనుమానం కారణంగా వాళ్ళను ఎలా నిలదీసేట్టు? పైగా అది వామన కారు. వామన శరభ అంతటి వాడు. అతను ఒక్క రోజులో అనంతను ఇంటికి పంపేయగలడు. తానూ వెళ్లి పోయినతర్వాత జరిగే అన్యాయాలను ఎలాగూ అరికట్టలేడు; అతనికి సంబంధం కూడా ఉండదు. ఇంట్లో దొంగ పడితే నాకు సంబంధం లేని పని అని అనుకోగలడా? అది కొత్వాలు పని, వాడే చూసుకుంటాడులే అను ఉదాసీన వైఖరి అవలంభించగలడా? ఎన్నో అన్యాయాలు తనకు తెలిసీ వీధిలో జరుగుతుంటుండగా ప్రేక్షక పాత్ర వహించడం తప్ప తాను ఆపగలిగింది ఒక్కటీ లేదు. పోలీసు, న్యాయ వ్యవస్థలు కూడా వాటన్నింటిని వదిలేయడం తప్ప చేయగలుగుతుంది ఏమీ లేదు. తాను బలవంతుడు కాదు ఏవిధంగానూ. తన బలాన్ని, బాధ్యతనూ అధికంగా ఊహించుకుని ఈ విషయంలో బాధపడుతూ, దాన్ని ఎలా నిరోధించడం అన్న విషయాలతో మనసును సతమతం చేస్తున్నాడు. ధర్మ సంస్థాపనకు తానే యుగయుగాన అవతరిస్తానని ప్రకటించాడు దేముడు. ఆయన వచ్చే వరకూ ఎదురు చూసి మంచీ చెడులను ఆయనకే వదిలేసే ఓపిక కావాలేమో మనుషులకు. ఈలోపు అంతరాత్మలను హింసించద్దని చెప్పాలేమో. ఈలోగా కాస్తో కూస్తో అధర్మాన్ని అరికట్టే పనిని సాంఘిక బాధ్యతగా ప్రతి వ్యక్తి శక్తిమేరకు ఎదుర్కొనాలా? దేవుడు ఒకవేళ నియమించక పోయినా మనకు కొంత బాధ్యత వదిలేసి ఉండొచ్చు. అలా అని అత్యుత్సాహం చూపిస్తూ తలదూర్చితే ఆ అంగానికి ముప్పురావచ్చు. మన అత్యుత్సాహానికి శిక్షలా అపకారం జరిగితే ఆయన రక్షిస్తాడన్న నమ్మకం ఏది?

ఇంటికి పోయి, నాలుగు మెతుకులు ఎంగిలిపడి, మంచం మీద వెల్లకిలా పడుకుని, రెండు చేతులూ వక్షం మీదికి చేర్చుకుని, నిద్రపోజూశాడు. నిశరాత్రి సగం అంతరించింది కానీ, నిద్ర కంటి పొలిమేరలను చేరలేదు.

గోయల్ ఉద్యోగం కష్టపడి ఇప్పించి తాను తిండితినే వీలును కలిగిస్తే, అతని ఇంట్లో తాను చూస్తుండగా కన్నాలు ఎవరో తొలుస్తుంటే అదిలించే ప్రయత్నమన్నా తాను చేయకపోవడం అన్యాయం అని అనిపించడమే కాక, శరభ తొలి ఉపన్యాసం అతనికి జ్ఞాపకం వచ్చి ప్రశ్నించింది. న్యాయం, ధర్మం, సామాజిక బాధ్యత మొదలైన ఘనమైన మాటలను

పక్కనుంచి, బాధిస్తున్న ఆలోచనా పరంపర నుంచి మనసును కాపాడుకోవడం ప్రధాన ఆవసరం; దానికి ఒకటే మార్గం. పొతే ఉద్యోగం పోతుంది – తల పోదు. తల పొతే మరొక తల దొరదుగాని పోయిన ఉద్యోగానికి బదులు మరొకటి దొరుకుతుంది. శరభయ్య చల్లని చూపూ, ఆతని శివుని నవ్వు గుర్తుకొచ్చి అభయమిచ్చాయి. నిజం చెప్పడానికి నిశ్చయించుకున్నాడు.

ఉదయం పదిగంటలప్పుడు వెళ్ళాడు శరభయ్య దగ్గిరికి. ఆయన అరగంట క్రితం వచ్చి, ఇరవై ఐదు నిముషాలు పూజ చేసి, పంచదార అద్దిన కొబ్బరిముక్క బుగ్గన తోసి నవులుతూ ఎదో కాగితం పట్టుకుని, కళ్ళజోడు ఉన్నా వాడకుండా కళ్ళకు దగ్గిరగా ఒకసారీ, దూరంగా మరొకసారీ రెండు రకాలుగా చదువుతూ గంభీరంగానూ, ప్రశాంతంగానూ ఉన్నాడు.

అనంతం వినయ విధేయతలతో నమస్కరించాడు. ఆయన ప్రతి నమస్కారం చేయడమే కాక శివుడిలా నవ్వాడు. మూలగా ముక్కాలిపీట మీది వెండి పళ్ళెంలోని పంచదారలో ముంచిన కొబ్బరి ముక్కలలో ఒక దాన్ని కుడిచేత్తో తీసి, ఎడమచేతిని కుడి మోచేతికి తాకించి అనంతంకు ఇచ్చాడు. కళ్ళకు అద్దుకుని నోట్లో వేసుకుని భక్తి ప్రపత్తులతో అనంతం నమలడం మొదలుపెట్టాడు,

"కూర్చో, అనంతం. నా దగ్గిర ఎప్పుడూ నిలబడక్కరలేదు," అన్నాడాయన.

"ఫర్లేదు, సార్," అని అనంత మొహమాట పద్డాడు.

"నీవు కూర్చుంటే నా గౌరవానికి భంగం రాదు; కూర్చోకపోతే అది ఇనుమడించదు. ఏదైనా విషయము మాట్లాడుకో వలసి వచ్చినపుడు అందరూ నిలుచునో లేదూ కూర్చునో ఆ పని చేస్తే అందరికీ సదుపాయంగా ఉండటమే కాక, శారీరక బాధలు ఉండవు. పోనీ నేను నిలబడతా," శరభయ్య అన్నాడు.

అనంతం మారు మాట్లాడకుండా కూర్చున్నాడు కాళ్ళు కూడా స్వల్పంగా ఒణికినట్టు అనిపించి.

"నిన్ను చూసినప్పుడల్లా నా యజమాని గోయల్ గారు గుర్తుకొస్తుంటారు."

"మీలోని ఔన్నత్యమ్ హద్దు ఎరుగనిది."

కంఠతా పట్టిన పాఠంలా రాత్రి తాను చూసినదీ, అంతకు ముందరి దొంగలెక్కల వ్యవహారంతో సహా అప్పగించాడు అనంతం. శరభ కళ్ళు పెద్దవి చేసి చెవులను రిక్కించాడు; అంతా విని తల దించుకున్నాడ;. నిట్టూర్చాడు; "ప్చ్" అన్నాడు – అనేక రకాల భావాలతో మనసు సతమతమవుతున్నట్టు.

“పొద్దున్నే మీ మనసు పాడు చేసినట్టున్నా, సార్!"

"ఫరవాలేదు, భాయ్. అన్యాయాలకు లోకంలో అవధులు లేకుండా పోతున్నాయి. పిదప కాలం, పిదప బుద్ధులు. జగం మొత్తానికీ ఉన్నది ఒక విభుడు, అతనే నాథుడు. ఎన్ని అన్యాయాలను చూడగలడూ? ఎన్ని అన్యాయాలను అరికట్టగలడూ? జగన్నాథుడే అరికట్టలేని అన్యాయాలను మానవ మాత్రులమైన మనం ఏమిచేయగలం? ఈ ప్రపంచం ఆయన కొంప. అయినా మానవ ప్రయత్నంలో లోపం ఉండరాదు. మనం చేయగలిగింది చేయాలి; చేయలేనిది

వదిలేయాలి. చేయలేక పోయామని ఏడుస్తూ కూర్చో కూడదు. ఈ విషయం పాపాల భైరవుడినైనా నాకు వదిలేయ్; నీవు నిశ్చింతగా ఉండు, అన్నీ మరిచి. నీ పనిని మాత్రం శ్రద్ధగా చేయడం మరువకు. రోజులు మంచివి కాదు. నిజానికి, రోజులకు మంచీ, చెడూ ఆపాదించడం పరమ అన్యాయం – ఈ రెండూ మనుషులకు సంబంధించినవి. మనుషులు తమ ముక్కుల నుంచి కారేదాన్ని తమ చేతులతోనే గోడకు రాసి తప్పు గోడకు ఆపాదించినట్టు – వాళ్ళ దుర్గుణాలను, దుష్ప్రవర్తనలను కాలానికి కట్టబెట్టి, ఏమీ తెలియనట్టు కుడి పక్కో, ఎడమ పక్కో చూస్తుంటారు."

అనంతాన్ని పంపేసి, ఉన్న ఫళంగా వామనను రప్పించి గంట సేపు తీవ్రంగా మాట్లాడాడు శరభ.

రోజులు దోర్లుతున్నాయి; అంతా సజావుగానే సాగిపోతున్నట్లు పైకి కనిపిస్తోంది. లెక్కలు కొంత మేరకు మరొకరికి అప్పగించడం వలన ఇబ్బందికరమైన లెక్కలు అనంతానికి కేటాయిస్తున్నట్టు లేదు. అవి బాధించని వ్యక్తికీ పిడుగులు పడ్డా నిర్లిప్తంగా నాకేమిటి నష్టం అనుకుని ఊరుకోగల వ్యక్తికీ ఆ బాధ్యత వెళ్ళి పోయింది. అలాంటి పనులు అతనికి మాత్రం ఎలా ఇస్తారు? అని పేచీ పెట్టలేదు అనంతం. దొంగతనాలు జరగడం ఆగదు; ఇక్కడ అంటే రెండు కళ్ళకు అవి కనబడక పోతే చాలు. ఆ జాగ్రత్త తీసుకోవడం అసాధ్యం కాదు.

వామన అనుభవజ్ఞుడు. వయసు తెచ్చిన పరిణితి అపారం. అనంతం శతకోటి లింగాల్లో ఒక బోడిలింగం. ఒకటి తక్కువ శతకోటి లింగాలకు భయపడని వ్యక్తి ఆ ఒక్క దానికీ భయపడడు. పిల్ల కాకికి ఉండేలుకూ ఉన్నఅనుబంధం అతనికి తెలుసు. అనవసర కోపాలాన్ని జయించినవాడు. ప్రతి విషయాన్నీ తీవ్రంగా ఆలోచించిన తరువాతే ఏ పనైనా చేస్తాడు. శరభ ప్రాణ మిత్రుడు కాదు; శత్రువు అసలే కాదు. ప్రతి మనిషికీ మరో మనిషంటే ఏహ్యాభావం ఆవగింజంతన్నా లేకుండా ఉండటం జరగని పని. కుట్టటానికి పూనుకున్న చిన్న పురుగునైనా ఉపేక్షించం; కనీసం మరో సారి కుట్టకుండా జాగ్రత్త తీసుకోకపోము. దొరికితే దొంగ మరింత జాగ్రత్త తీసుకుంటాడుగాని లాభదాయకమైన దొంగతనాన్ని విసర్జించడు ఏ బుద్ధుడో చెబితే తప్ప.

ఏడో రోజున శరభ కార్మికులనూ అజమాయిషీ చేసేవాళ్లను ఉద్దేశించి తీవ్రస్థాయిలో ఉపన్యసించారు. వామన ఎటో చూస్తూ కూర్చోడం అనంతం గమనించి సంతృప్తి పడ్డాడు.

“ధర్మాన్ని మనం కాపాడుకోవాలి; దానంతట అది తనను కాపాడుకో లేదు. దానికి మనం సాయం చేసినపుడు అది ప్రత్యుపకారం చేస్తుంది. అదీ ఒక వ్యాపారమే కావచ్చు; నాకు అలాంటి వ్యాపారం గురించి తెలియదు. అన్నీ నాకు తెలియాలని గాని, నేను తెలుసుకోవాలని గానీ లేదు, ధర్మాన్ని ధర్మం గురించి కాదు మనం కాపాడుకోవలసింది; మన గురించి. ఇవి నా మాటలు కాదు. మన కంటే పెద్దలు సంస్కృతంలో అన్నవి. పెద్దలు తెలుగులో అన్నవాటికన్నా, సంస్కృతంలో అన్నవాటికి ఎక్కువ విలువ ఇవ్వాలి. అయినా, నేను ఆ విషయాల్లోకి ఇప్పుడు పోదలచుకోలేదు. పైగా అలాంటివి పండితులూ పండితులూ సిగపట్ల ద్వారా తేల్చుకుని ఆచరణ నిమిత్తం మనకు చెప్పవలసిన విషయాలు. దీపం ఆరిపోకుండా మనం రక్షించుకుంటే అది చీకటి పళ్ళు ఊడగొట్టి మనకు త్రోవ

చూపిస్తుంది. దీపాన్ని కూడా మీ అంతట మీరే వెలిగించుకోవాలి. నిన్ను నీవే వెలిగించుకుని అప్పనంగా మాకు వెలుతురుని ఇవ్వు మాకు కావలసిన త్రోవను మేము పోతాము అనే రకాలము మనం. అసలైన కష్టం ఏది ధర్మం ఏది కాదు అని తేర్చుకోడములో ఉంది."

ఆ పలుకులు విని అనంత సంతసించాడు. అధర్మాన్ని అరికట్టే పనికి శరభ పూనుకుంటున్నాడని, భువన ధర్మానికి అనంతం ఒక దర్భ వంతైనా దోహదమ్ చేయగలిగినందుకు అతని ఒడలు పులకరించాయి.

ఎనిమిదో రోజు అనంతానికి కబురు పెట్టాడు శరభ.

"మొత్తం మీద నా ఫిర్యాదును వారం రోజులు పూర్తిగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుని ఉంటాడు. వామనంతా వ్యక్తికీ ఏ శిక్ష వేయగలడు? అసంభవం. ఉరుము ఉరిమి మంగళం మీద పడదు కదా. డ్రైవరినో, సహకరించిన కార్మికులనో బలి తీసుకుని, వామనను మెత్తగా మందలించి విషయాన్ని ముగిస్తారేమో!"

అప్పుడే సుష్టిగా భోంచేశాడు శరభ. అందువలన మామూలుకన్నా అధిక ప్రసన్న వదనంతో ఉన్నాడు. పిలుస్తే వచ్చే చిరునగవు ఇప్పుడు పిలవకపోయినా ఒచ్చేస్తానంటోంది. తాంబూల సామాగ్రిని బయిటికి తీసి ఉంచాడు. తాంబూలం తయారయి అతని నోటికి చేరితే అఫ్జల్ గురు నైనా, శరభయ్య మీద హత్యాప్రయత్నం చేసినవాడినైనా శిక్షించవద్దని ఢిల్లీ దాకా నేరస్థుల తరఫున వాదిస్తాడు, పత్రికలకు వ్యాసాలూ రాస్తాడు. ఏ కుక్కైనా అడగాలి కానీ దధీచిని మరిపిస్తూ తన వెన్నుముఖను చేత్తో తీసి ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర లేదు.

పక్కనే ఉన్న భోజనం బల్ల మీద చైనా ఎముక పళ్ళెములో భోజన అవశేషాలు ఉన్నాయి. అతని ఆకలి తీర్చడానికి తాను దేహం చాలించిన మహోన్నత జీవి యొక్క ముల్లో, పళ్ళో, తోకో, ఎముక ముక్కలో – దురదృష్ట వశాత్తు భుజింప వీలుకానివి; కమ్మని గుర్తులుగా మిగిలి ఉన్నాయి. మృత దేహ శకలాలను శరభ తన పళ్లతో చీల్చి చండాడిన దాఖలాలున్నాయి. అతని మనసులో మెత్తదనం ఉంది గాని పళ్లలో లేదు. అంతరించిన భోజనం తన కమ్మని జ్ఞాపకంగా మసాలా పరిమళాలను వీడి పోయింది. శరభ కుక్షిలో భోజనం జీర్ణమయి పోయినా, పరిమళం మిగిలే ఉంటుంది.

తాంబూలం తయారీలో శరభ ప్రదర్శించే కళాత్మకత ఎరిగి ఉన్న అనంతం శబ్దం కూడా చేయకుండా నిలబడే ఉండి పోయాడు. కట్టలో నుంచి లేత ఆకులను మాత్రమే ఎంపిక చేసుకుని వాటిని బల్లమీద వెల్లకిలా ఉంచాడు, సముద్ర చేపలను ఇసుక తిన్నెల మీద ఆరబెట్టినట్టు. ఒక్కో దాన్నీ తీసి ఈనెలు పీకేశాడు. కాన్వాస్ మీద రంగేసినట్టు చిరు కుంచెతో ఎర్ర సున్నం రాసాడు. ఆరు ఆకులను ఆప్యాయంగా చేతిలోకి తీసుకుని, పొట్లం నుంచి వక్కపొడిని వాటిలోకి రాల్చాడు. వేరే పొట్లాలనుంచి ఒక లవంగం, ఒక యాలుక, కొంచం కుంకుమ పూవు, జాజికాయ రవ్వ జత చేశాడు. ఆకులను చిలకలా చుట్టి బొటనవేలికి తగిలించాడు. దాన్ని నోటితో అందుకున్నాడు, బుగ్గకు తోశాడు, పక్క పళ్లతో కరిచి పట్టుకున్నాడు. మనిషి ప్రేమించే వాటిలో నోరు, కడుపు, మరొకటి ప్రథమ శ్రేణిలో ఉంటాయి. వాటిని రంజింప చేసే సామగ్రి మీద శ్రద్ధ చూపించడం తప్పు కాదు. నీ కడుపు వగైరాలను ప్రేమించలేకపోతే, సాటి మనిషిని ఏం ప్రేమిస్తావు?

"చుట్టూ ఉన్న చీకటిని చూసి తిట్టుకుంటూ కూర్చోడం కన్నా, చిరు దీపం వెలిగించుకోవడం మిన్న అన్నారు సంస్కృత పెద్దలు. వాళ్ళ మీద నాకు అపార గౌరవం; అది వేరే విషయం. కానీ అది  అంత సులువైన విషయం కాదని నేను అనుకుంటుంటాను, పెద్దలు నన్ను క్షమిస్తారు. అది సులువైనది అయితే, ఎవరూ చెప్పకుండానే ప్రతి ఒక్కరూ ఒక చిరు దీపం వెలిగించి చీకటిని తిట్టుకోకుండా వెలుతురిలోనే జీవించే వారు. మనిషి ఆలోచన ఎలావుంటుందంటే – తాను వెలిగించుకున్న దీపపు వెలుతురు ప్రక్క వాడి చీకటిని కూడా పారద్రోలుతుందేమో నని, తానూ చీకటిలోనే దేవులాడుదామనుకుంటాడు; అగ్గిపుల్ల ఖర్చుకు, నూనె ఖర్చుకూ వెనుదీస్తాడు. నీవు నిస్వార్థంగా, నీవు అధర్మంగా భావించిన దానిని ఎదిరించడానికి తెగింపు చూపావు. అభినందిస్తున్నా. తాను కరగనని కొవ్వొత్తి భీష్మించుకు కూర్చుంటే రాత్రిళ్ళు; విద్యుత్ కొరవడినపుడు – మానవాళికి వెలుతురు కరవ వుతుంది. అందరికీ ఎలిమినేటర్లు, జెనరేటర్లూ అందుబాటులో లేవు. ప్రతి వ్యక్తీ కొవ్వత్తిగా మారే త్యాగధనుడు కాలేడు; పైగా అందరూ త్యాగాలకు సిద్ధపడితే వాటి ఫలితాలు అనుభవించే వారు ఉండరు."

"మీరున్నారన్న భరోసాయే నా తెగింపుకు ఊతమిచ్చింది."

శరభ తాంబూలపు నోటితో నవ్వాడు. లేడిని ఒక తిండిగానే కాక, శత్రువుగా భావించే పులి అప్పుడే భోజనం ముగించి నవ్విన ఎర్రటి నోరులా శరభ నోరు తోచింది. ఈ నవ్వు అనంతానికి అంతలా నచ్చలేదు; పైగా ఒణుకు పుట్టించింది. అనంతాన్ని బాగా మాట్టాడించాలని, తాను అతనితో మరిన్ని విషయాలను ముచ్చటించాలనీ అనిపించింది శరభకు.

అది అలా రెండు క్షణాలు ఉంచుదాము.

శరభకు స్థలాలూ, ఇళ్ళూ అంటే బలహీనతుంది. ఆ బలహీనత అతని చేత కంపెనీ గుడినో, లింగాన్నో మింగేట్టు చేసి – ఐదు ఇళ్ళూ, నాలుగు స్థలాల్ని కొనిపించింది. అతనికి ద్రాక్షపళ్లంటే వల్లమాలిన ఇష్టం. ఆ ఇష్టం అతని చేత ఒక ఎకరా ద్రాక్ష తోట కొనేట్టు చేసింది. అతనికి భార్యంటే ఎంతో ఇష్టం; ఆమెకు బంగారమంటే ప్రాణం. భార్యకు ప్రాణమైనదానిని రెండు మూడు కిలోగ్రాముల దాకా కొని కానుకగా ఇచ్చి, ఆ రాత్రి ప్రతిరాత్రికన్నా అధికంగా సుఖించాడు. తాను ప్రాణంగా భావించినదానిని తనకు ప్రసాదించిన భర్త మీద కూడా  ఆమె ఇష్టాన్ని ఏర్పరచుకుంది.

శరభ ఉంటున్న అతని (నాలుగో) ఇంటిలో చుక్కల్లా బోలెడు ఎలుకలూ, చంద్రుడిలా ఒకే పిల్లీ ఉన్నాయి. సృష్టి సమవర్తి కాదు. అందువల్లే ఒక జాతిని అంత అధికంగా, మరో దాన్ని అంత పిసినిగొట్టుతనంతోటీ పుట్టిస్తుంది. సృష్టిలోని మరో వింతేమిటంటే చలిచీమలన్నీ కలిసి పామును చంపగలవు (అని విన్నాము); ఎలుకలు ఏకమై పిల్లిని చంపడం ఎక్కడా వినలేదు సరికదా, ఒక పిల్లి మెడలో గంటకట్టలేని అసమర్థత గురించి విన్నాము. ఆ పిల్లి ఎలుకల జోలికి పున్నమికి లేక అమావాస్యకో ఒక సారి కూడా వెళ్లిన దాఖలా లేదు. మాంసాహారం మీద విముఖత అని అనుకోడానికి లేదు. అసమర్థతో, భయమో తెలియదు. వైరాగ్యంతోనో, మత పిచ్చితో ఆత్మాహుతి చేసుకునే ప్రయత్నంలోనో ఏదన్నా

ఎలుక దొరికితే లొట్టలు వేసుకుని భక్షిస్తుంది శరభ పిల్లి. ఒక వేళ వైరాగ్యపు, ఆత్మాహుతికి పాల్పడే మూషికాల మీద మాత్రం దానికి మక్కువేమో.

శరభ పెరడులో గంపెడు కప్పలున్నాయి. కావాలని అవి దొరికి పోయినావాటి మాంసం పిల్లికి, (చైనీయుడు కాదు కాబట్టి) శరభయ్యకు రుచించదు. అందుబాటులో ఉన్న మరో జీవిని ఎందుకు ఊరికినే ఒదిలెయ్యాలని పిల్లి వాటితో ఆడుకుంటూ వాటి చేత ఒంటేలు పోయిస్తుంటుంది. అది నోటితో కప్పను పట్టుకుని ఓ నిమిషం ఉంచుకుంటుంది; దాని పళ్ళు తన శరీరంలో దిగబడక పోయినా భయంతో కప్ప లబలబలాడుతుంది. నోటితో ఒదిలి రెండు పంజాలతో కదలకుండా పట్టి ఉంచుతుంది. కప్పను పిల్లి కొట్టకుండానే, తిట్టకుండనే కప్ప ప్రాణాలు రెక్కలు తెచ్చుకుని పైకి ఎగిరిపోజూస్తాయి. పిల్లి కప్పను పూర్తిగా వదిలేస్తుంది. ఒక నిమిషం నీకు స్వేచ్ఛను ఇచ్చాను, ప్రాణ బిక్ష పెట్టాను పో, అన్నట్టు. బ్రతుకు జీవుడా అని నిట్టూరుస్తుంది కప్ప. తిరిగి, తరిమి తరిమి ఇంతకు ముందు చేసిన పనులు ఒక దాని తరువాత మరొకటి చేస్తుంది పిల్లి. మ్యాన్ కెనాట్ లివ్ ఆన్ బ్రెడ్ అలోన్ అన్నట్టు, క్యాట్ కెన్నాట్ లివ్ ఆన్ రాట్ అలోన్.

ఆ క్రీడ చూసి శరభ సరదా పడటమే కాక పాఠం నేర్చుకున్నాడు. చీమ కూడా ఆరడుగుల మనిషికి పాఠాలు నేర్పే పంతులయ్యా లేక పంతులమ్మ కదా; ఏమిటీ సృష్టి వైచిత్రి అని సృష్టి యజమాని భగవంతుడిని ఒక మారు తలుచుకుని తన రెండు చెంపలను ఒక చేత్తో తాకుతాడు లెంపకాయను శాస్త్రోక్తంగా వేసుకున్నట్టు.

రెండు క్షణాలు గడిచాయి.

"పులితో మాట్టాడుతున్నట్టు భయ భయంగా ఎవరైనా నాతో మాట్లాడితే, వాడు నన్ను అవమానించినట్లుగా నేను భావిస్తాను. ఒక మంచి స్నేహితుడితో వ్యవహరించినట్లు నాతో వ్యవహరించు. వయసు తారతమ్యం స్నేహానికి, కామానికీ అవరోధం కాదు. అసలు విషయంలోకి వెళ్లబోయే ముంది కొన్ని ఉపోద్ఘాత విషయాలు ముచ్చటించుకుందాము. నిజానికి ముందు ముచ్చటించుకో బోతున్నవే అసలు విషయాలు."

"అద్వైతం మీద ఉపన్యాసం ఇవ్వాలి, కానీ నీ కాలాన్ని వృథా చేయడం ఇష్టం లేక పోవడం వలన ఇవ్వబోవడం లేదు. నాకు కొన్ని నియమాలున్నాయి. మనం సముపార్జించిన జ్ఞానాన్ని మనలోని అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలడానికి మాత్రమే ఉపయోగించుకోవడం స్వార్థం అవుతుంది. నా జ్ఞానమనే దీపంతో మరొకరిలోని చీకటిని పోగొట్టడానికి దీపాన్ని వెలిగించే ప్రయత్నం చేస్తుంటాను. నాలో ఒక తాత్త్విక కోణం కూడా ఉందని నీవు గ్రహించ వలసిన అవసరం ఉంది. నేను ప్రతి విషయాన్నీ నా తాత్త్విక కోణం నుంచీ పరిశీలిస్తాను. అలా చూసినపుడూ ఏదీ నాకు నేరంగా, తప్పుగా అనిపించదు. ఈ మిథ్యా ప్రాపంచిక విషయాలను తీవ్రంగా భావించడం విజ్ఞత అనిపిపించుకోదు – నీవు నా దృష్టికి తెచ్చిన విషయాలతో సహా ఏదీ నేరంగా తప్పుగా కనిపించదు. ప్రతి జీవిలోనూ దేవుడ్నీ, దేవుడిలో ప్రతి జీవినీ దర్శిస్తాను. దేవుడిని నిందించ గలమా? తప్పు పట్టగలమా? ఇక లౌకిక కోణం నుంచీ ఆలోచిద్దాము. కుర్రతనపు అపరిపక్వతతో నీవు ఎవరికో దొంగతనం ఆపాదించవచ్చు – నిన్ను దానికి తప్పు పట్టను. అసలు ఏ వస్తువూ, ఏనాడూ దొంగిలించని మనిషి ఈ సృష్టిలో

కలడా? దొంగిలించిన ప్రతి మనిషీ దొంగే అని సిద్ధాంతీకరిస్తే, మరొకరి చిన్నవస్తువును సొంతం చేసుకున్న వాళ్ళతో సహా మనుషులంతా దొంగలే కదా? అందరూ దొంగలే అయినపుడు ఒక దొంగ మరొకడిని 'దొంగ' అనడం అన్యాయం అవుతుంది. నీ మతం, కులం నాకు తెలీవు; పోనీ క్రీస్తుని ఉటంకించే ధర్యం చేస్తాను. మొదటి రాయిని, ఎవరిని ఎవరి మీద విసరమన్నాడు? ఎవరి కంట్లో ఏదుంచుకుని ఎవరి కంట్లో దేని గురించి మాట్లాడటం తప్పన్నాడు? ఈ ప్రపంచంలో ఏది మాత్రం ఎవడబ్బ సొమ్ము? 'ఎవడి దాన్ని' వాడు మరొకడితో సమంగా పంచుకోకపోవడమనే స్వార్థం వలననే 'ఒకడి దాన్ని' వాడికి తెలీకుండా మరొకడు తీసేసుకుంటున్నాడు. వెయ్యికి పైగా భాషలు కనిపెట్టిన మనుష్య జాతి అలా తీసేసుకోవడాన్ని దొంగతనం, దోపిడీ అని పిలుస్తుంది. పారమార్థిక దృష్టిని మనుజులెల్ల అలవరుచుకున్నప్పుడు 'ఇది నాది' అన్న మమకారం నశిస్తుంది. మమకార నాశంతో ప్రాతిదీ అందరిదీ అన్న భావన నెలకొంటుంది. ఆ శుభవేళ, దొంగతనం, దోపిడీ అన్న మాటలు మన భాషాజాలం నుంచి నిష్క్రమిస్తాయి. ఇప్పుడు గతి తప్పని తార్కిక ఆలోచన చేద్దాం, మీరు భావించినట్టుగా 'దొంగతనం' జరిగింది అని నేడూ మాట వరుసకు భావిస్తాను. వామన రావు గారికి తెలియకుండా మిగతా ఇద్దరూ కలిసి ప్యాకేజీ పెట్టెలు తస్కరించి ఉండొచ్చుగదా; అతనికి తెలియకుండా వాళ్ళు దాన్ని అతని కారు డిక్కీలో దాచి, మరోచోట ఎక్కడో కైంకర్యం చేసి ఉండొచ్చు. కాదనగలరా?"

"అలాంటప్పుడు వాళ్ళిద్దరి మీదనన్నా చర్య తీసుకోవచ్చు."

"వాళ్ళు తీసుకెళుతుండగా పట్టుకుని ఉంటే చర్య తీసుకోవడం సాధ్యపడేది. జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇప్పుడు వాళ్ళను నిలేస్తే ఎదురు దాడికి దిగుతారు; దొంగతనం మా నెత్తిన రుద్దుతారా అంటారు. చిన్న చిన్న దొంగతనాలు ఏ కార్ఖానాలోనైనా సాధారణం. అస్సలు దొంగతనం పనికి రాదు అనుకుంటే కార్ఖానాలు మూసేసుకోవాలి."

"తప్పు చేసిన వాళ్ళను ఏమి చేయాలా, చేయగూడదా అన్నది మీ ఇష్టం. నా కంటితో చూసిన దానిని నిజాయితీతో పెద్దవాళ్ళ దృష్టికి చేర్చడం ఇక్కడ పనిచేస్తున్న మనిషిగా నా బాధ్యత; అది నెరవేర్చాను. నేను ఉద్యోగంలో చేరిన రోజున నిజాయతీగా నడుచుకొమ్మని మీరే శలవిచ్చారు."

"నీవు నిజాయితీగా ఉండమని అన్నానేమోగాని, అందరి నిజాయితీల మీద అజమాయషీ చేయమని చెప్పుండను."

"నా కంటి ముందు దొంగతనం జరుగుతుంటే పెదవి విప్పకుండా ఉండటం, నాకు అన్నంపెట్టే సంస్థకు ద్రోహం జరుగుతుంటే పట్టనట్లు ఊరుకోవడం నా నిజాయితీని భంగపరచదా?"

"ఇది కోటి అన్యాయాల కాలం; దానికి కలికాలం అని చక్కటి పేరు మాత్రం ఉంది. అన్యాయాలన్నింటినీ నిజాయతీ పేరుతో నెత్తికి రాసుకుంటూ పొతే, కంటికి కునుకుండదు, మ్రింగడానికి ముద్ద ఉండదు, ఒంటేలుకి వెళ్ళడానికి వ్యవధి ఉండదు. జీవితంలో పట్టు విడుపులుండాలి. పోను పోను, జీవితంలో నీవే తెలుసుకుంటావు. పట్లు తక్కువగాను, విడుపులు మిక్కుటంగాను ఉండాలి. దొంగ దొంగతనం ఎందుకు చేస్తాడో మరో విధంగా ముచ్చటించుకుందాము: కడుపు

నింపుకోడానికి కూడా దాచుకోడానికే కాక. కొంత సానుభూతి దొంగ మీద కూడా చూపించాలి, వాడు మన ఇంట్లో పడనప్పుడన్నా; మన శత్రువు ఇంట్లో పడి వాడు దొరికి పోయినప్పుడన్న."

"వామన గారు సగం దొంగ. దొంగ పని చేస్తేనే గాని, దొంగ లెక్కలు రాస్తేనే గాని అయన కడుపుకు ముద్ద దొరకదంటారా?"

"నీకు లెక్కలు బాగా వచ్చని వామన గారు చెప్పారు. పోనీ నీ లెక్కల ప్రకారం చూసినా, వామన సగం దొరగా భావిస్తాను. అతను తప్పుడు లెక్కలు వ్రాయిస్తాడని నీ అభిప్రాయం. స్వలాభం అందులో కించిత్తు ఉండొచ్చుగాని, లాభంలో ఎక్కువ భాగం నా యజమానులదే. దొంగ లెక్కల గురించి యజమాని గుండెలు బాదుకోరు సరిగదా, సమర్థిస్తారు. అలాంటి సంపాదన నుంచే నీ జీతం డబ్బులు నీకు దక్కుతాయి. సత్యహరిశ్చంద్ర ముద్ర లెక్కలు మాత్రమే వ్రాద్దామని వామన అన్నా, నేను అన్నా ఇంటికి పోయి విశ్రాంతి తీసుకుంటూ గడపమంటారు మా యజమానులు; నిజాయతీ లెక్కల వల్ల నష్టపోయేది ఎక్కువగా వాళ్ళే కాబట్టీ. పన్నులు అధికంగా ఉంటాయి – నిజాయతి మీద పన్నన్నమాట. పన్నుల రూపంలో అందే డబ్బును రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారులు బొక్కుతారు. ఒక మాజీ ప్రధాని అన్నాడు ప్రజలపేరుతొ ఖర్చు పెట్టే ధనంలో రూపాయకు పది పైసల వంతు మాత్రమే సద్వినియోగమవుతుందని. చివరగా చెప్పాల్సిందేమిటంటే, న్యాయమైన లెక్కలు వ్రాసి పన్ను రూపంలో ప్రభుత్వానికి చేరవలసిన ప్రతి రూపాయీ కట్టే పనైతే వ్యాపారం ప్రభుత్వం గురించి మాత్రమే చేస్తున్న వాళ్ళం అవుతాము. ప్రభుత్వం అంటే అది ప్రజలది కాదు – రాజకీయనాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, సంపన్నులు – వీళ్లది."

"అయతే, నేను సెలవు తీసుకుంటాను. మీ కాలాన్ని వృథా చేసినట్టున్నాను."

"తీసుకుందుగాని, దానికేమి భాగ్యం? మరొక్కక్షణం ఓపిక పట్టు, ఇంతసేపూ ఎలాగూ పట్టావు. ఒక సమస్యను చేపట్టిన తరువాత దానికి ఏదో ఒక పర్యవసానమో, పారిష్కారమో ఉండాలి. కొన్ని సమస్యలకు, పరిష్కారం కనుక్కోకుండా వొదిలెయ్యడమే పరిష్కారం, అని దేశానికి ప్రధాన మంత్రిగా ఏలిన మన పదారణాల తెలుగాయన అన్నాడు. నీవు కుక్కా గాడిదా కథ చదివావా? చదివి ఉండకపోతే చెబుతాను పనిలో పనిగా. జీవితంలో గొప్పగా ఉపయోగపడుతుందది. ఒక వేళ నువ్వు చదివే ఉండుంటే ఎలా అర్థం చేసుకున్నావు? వినాలని నాకు కుతూహలంగా ఉంది."

"చదివాను చాలాసార్లు. అది ఒక గొప్ప నీతి కథ. ప్రతి గాడిదా, కుక్కే కాక మనిషి కూడా ఆ కథనుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. అయితే ఆ కథనుంచి ఒక్కొక జీవి ఒక్కో పాఠం నేర్చుకుంటుంది. నేను అనుకుంటాను గాడిద మనకు ఆదర్శం కావాలని; దాన్ని సత్వరం మన జాతీయ జంతువుగా ప్రకటించవలసిన ఆవశ్యకత ఉందని. మనం ఆ గాడిదనుంచి పాఠం నేర్చుకోము – మనం మనుషులం కదా! అహం అడ్డొస్తుంది. నిజానికి గాడిదలకు గాడిదలము. అంత ఉన్నతమైన జీవి ఆ కథలో చిన్న చూపుతో ఎందుకు చూడబడిందో, అడ్డ గాడిదలుగా పుట్టవలసిన

మనుషులు మనుషులుగా ఎలా అవతరించారో అన్న ప్రశ్నకు మీ అసలు యజమాని, అనగా దేముడు, అదే సృష్టి కర్తను అడగండి. సృష్టి అన్యాయాల మయం. వాటి సరసన ఈ అన్యాయమూ చేరుతుంది. తన చేత గాడిదచాకిరీ చేయించుకొనడానికి దానికి ఇంత తిండి పెట్టే వాడుగనుక ఆ యజమాని పట్ల గాడిద కృతజ్ఞతతో ఉండాల్సిన పని లేదు; అది అతనికి ఏ విధంగానూ బాకీ పడి లేదు. అయినప్పటికిన్నీ, తన పని కాక పోయినప్పటికిన్నీ, బాధ్యతా రహితంగా ప్రవర్తించిన కుక్క రీతికి ఆవేదనతోనూ, యజమాని నష్ట పోకూడదన్న సహృదయంతోను అది ఓండ్ర పెట్టింది, మానవాళికి తద్వారా సందేశం ఇస్తూ. గాడిదలకు గార్దభం లాంటి యజమాని దాన్ని నిర్దాక్షిణ్యంగా శిక్షించి తన మనిషిబుద్ధి చూపించుకున్నాడు. మనం విశ్వాసము లేని శునకాలం. విశ్వాస గుణం కొరవడితే, నిజానికి శునకం శునకం కాదు – అంగాలూ, మొరుగుడు లక్షణాలున్నా. ఉప్పుకు ఉప్పదనం కొరవడితే అది ఉప్పు కాదు, రాతి పొడి; దాని పేరు మార్చాలి. అందుకని అంటాను – ఆ కుక్క మన తోబుట్టువు. మనం నిర్వర్తించవలసిన ధర్మం మనం నిర్వర్తించము; పైగా మరో జీవి నిర్వర్తించ వలసిన దానిని కూడా తన నడుం మీద వేసుకుని దెబ్బలు తిన్న మహత్తర జీవి పట్ల సానుభూతి చూపించడం మాట అటుంచి, హేళన చేస్తాము."

ఆ మాటలంటున్నప్పుడు బల్ల సొరుగు తీసి, నోట్లను కవరు బైటికి తీయడం, తన ముందు నెమ్మదిగా, ఏమీ పట్టనట్లు తోయడం, అనంతం గమనిస్తూనే ఉన్నాడు. గాడిద కథ మీద తన అభిప్రాయం శరభ అడగక ముందే తనకు ఉద్వాసన పలుకుతాడని గ్రహించాడు. అందుకే గాడిద కథ మీద తన అభిప్రాయాలను కుండ బ్రద్దలు కొట్టినట్టు చెప్పాడు. అంత కటువుగా అనంతం మాట్లాడినా, శరభయ్య మూడోవ కన్ను తెరవలేదు. చల్లని చూపులు చూస్తూ నవ్వాడు – ఒక పాపిని చూసి పుణ్యవంతుడు జాలిపడినట్లు.

గోయల్ గారి ద్వారా ఆ ఉద్యోగం ఒచ్చింది కనుక అది పోయిన విషయమూ ఆయనకు చెప్పడమూ కనీస మర్యాద, సంస్కారం అని అనిపించింది. గోయల్ గారికి జరుగుతున్న అన్యాయాన్ని కూడా ఆయనకు తెలియ చెప్పడం న్యాయం. మోహిని గారు తన దగ్గిరకు తిరిగి రావద్దని చెప్పకనే చెప్పారు గనుక ఆమె దగ్గిరకు వెళ్లి ఆమెను ఇబ్బందిపెట్టటం, తద్వారా తనను తానూ ఇబ్బంది పెట్టుకోడం వివేకవంతమైన పని అని అనిపించలేదు.

"గోయల్ని మాటాడుతున్నా."

"విశాఖపట్నం కంపెనీలో ఉద్యోగం ఇచ్చారు నాకు. మీ బంగళాకు వచ్చి మిమ్మల్నిఇబ్బంది పెట్టాను. నా పేరు అనంతం. నా పేరు ఒక అబద్ధమని కూడా సరదాకు అన్నారు మీరు."

"మోహిని గారు గుర్తున్నంత వరకూ నువ్వు గుర్తుంటావయ్యా. ఆమెను మరిచే ప్రసక్తే లేదు. చిన్నప్పుడు ఎత్తుకుని ముద్దు చేసిన వ్యక్తిని మరిచి పోలేము కదా? ఆమె బాగున్నారా? ఈసారి కలిసినప్పుడు అడిగానని చెప్పటం మరువకు."

"మళ్ళీ ఆమె దగ్గిరకు వెళ్లడం అవ్వలేదు. ఎప్పుడన్నా కలిస్తే మీకు ఆమె అంటే ఎంత వాత్సల్యమో చెబుతాను. మేడం బాగున్నారా?"

"ఆ ఏం బాగు? ఫరవాలేదు."

అనంతం ఆంతా పూసగుచ్చినట్టు చెప్పాడు; ఆయన ఏ శబ్దమూ చేయకుండా, ఊపిరి మాత్రం పీలుస్తు, పదులుతూ అవతలివాడికి ఆయన వింటున్నాడో లేదో తెలియకుండా పొల్లు పోకుండా విన్నాడు.

"నీవు వాళ్లిద్దరి మధ్యా తగవులు పెట్టబోయ్యావని; నీకు సంబంధించని విషయాల్లో కాలూ వేలూ పెట్టబోయావునీ; తప్పని పరిస్థితిలో నిన్ను మానిపించవలసి వచ్చిందనీ ఒకరి తరువాత ఒకరు ఇద్దరూ చెప్పారు."

"వాళ్ళు తోడు దొంగలు. దొంగ లెక్కలు వ్రాస్తున్నారు; కంపేనీ సొమ్మును రాత్రి వేళల్లో వెలుపలకు చేరవేస్తున్నారు. మీరు దయతో నాకు ఉద్యోగం ఇప్పిస్తే నేను చూస్తూ ఊరుకోడం న్యాయం కాదని నాకు నా మనసు చెప్పింది. శరభ గారు తోడుదొంగ కాదనుకుని ఆయనకే ఫిర్యాదు చేశాను. ఆయన హితబోధ చేసి ఇంటికి వెళ్లిపొమ్మన్నారు."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS